క్లుప్తంగా

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

తిరువూరు: ప్రజలకు రక్షణ కల్పించే విధులు నిర్వహిస్తూ ప్రాణాలొదిలిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని తిరువూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు అన్నారు. సోమవారం సాయంత్రం తిరువూరులో పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా చీరాల సెంటర్ నుంచి ఫ్యాక్టరీ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రాణాలొడ్డిన అమరవీరుల ఆశయాలకనుగుణంగా పనిచేస్తామని పోలీసులు ప్రతిజ్ఞ చేశారు. పలువురు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఐలు సత్యనారాయణ, వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు లీటర్ల సారా స్వాధీనం

రెడ్డిగూడెం(మైలవరం): రెడ్డిగూడెం మండలంలో జరిపిన దాడుల్లో శ్రీరాంపురం గ్రామానికి చెందిన కోట నాగరత్నం నుంచి రెండు లీటర్లు, కూనపురాజుపర్వ గ్రామానికి చెందిన గొల్లమందల భూపతిరాజు (బాబు) నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వారిద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జే. శ్రీనివాస్ సోమవారం తెలిపారు. వీరిద్దరినీ రిమాండ్‌కు పంపడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో మైలవరం ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌ఐ ఎం. దుర్గా ప్రసాదరావు, హెచ్‌సీలు కుమారస్వామి, నాగరాణి, కానిస్టేబుల్స్ రమేష్, సాయి కృష్ణ, సర్వేష్, చెన్నకేశవులు, రాజకుమార్ పాల్గొన్నారని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జాహ్నవి ప్రతిభ

తిరువూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా 68వ పాఠశాల క్రీడల్లో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కే జాహ్నవి అండర్- 17 విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పీఎస్‌ఎన్ రాజు తెలిపారు. ఈ నెల 16 జగ్గయ్యపేటలో జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో హైజంప్ అండర్- 17 విభాగంలో ప్రథమ స్థానం సాధించిన జాహ్నవిని ఉపాధ్యాయులు అభినందించారు. తమ పాఠశాల విద్యార్థిని దీపిక అండర్- 14 విభాగంలో హైజంప్‌లో తృతీయ స్థానం, డిస్కస్ త్రోలో ఎం.మయూరి తృతీయస్థానం సాధించారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు.

బీసీ కాలనీలో డ్రెయినేజీ తవ్వకం

విస్సన్నపేట: స్థానిక బీసీ కాలనీలో కొంత కాలంగా ఉన్న డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి రెడ్డిగూడెం రోడ్డు వాగుకు మళ్లించే పనులు సోమవారం చేపట్టినట్లు పంచాయతీ ఈఓ హరికృష్ణకుమార్ తెలిపారు. బీసీ కాలనీలో డ్రెయినేజీ పారుదల లేకపోవటంతో మురుగు నీరు నిల్వ ఉండటంతో సమస్యను పరిష్కరించేందుకు శాశ్వత చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్ సత్యవతి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ఆగిరిపల్లి: తోటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ నాగమోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రోస్పెరిటీ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నున్న పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ నాగమోహన్‌రావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ డెప్యూటీ మేనేజర్ శివనాగేశ్వరరావు, సర్పంచ్ ఆరేపల్లి పద్మ, ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యస్నేహితుడి కుటుంబానికి చేయూత

తిరువూరు: ఇటీవల అనారోగ్యంతో మరణించిన తమ స్నేహితుడి కుటుంబానికి యువకులు అండగా నిలిచారు. తిరువూరు రాజుపేటకు చెందిన పెరుమాళ్ల శివప్రసాద్ మృతి చెందడంతో అతని కుమార్తె దీక్షిత పేరుతో రూ.40 వేల నగదును ఆయన తోటిస్నేహితులు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మరో స్నేహితుడు మునుకుంట్ల శ్రీను రూ.60 వేలను శివప్రసాద్ కుమార్తె భవిష్యత్ అవసరాల నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్ స్నేహితులు పెరుమాళ్ల నిరంజన్, మోదుగు వెంకటేశ్వరరావు, రాజ్ మహమ్మద్, కాలసాని గోపాల నాగేశ్వరరావు, తోట శ్యామ్, తోట శ్రీను, కాటంరాజు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలి

ఇబ్రహీంపట్నం: వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాపాడాలని ముస్లిం పర్సనల్ లాబోర్డు ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అల్తాఫ్‌రజా కోరారు. తాడేపల్లిలో ముస్లిం మైనార్టీ వ్యవహారాల శాఖ కమిషనర్ చిట్లూరి శ్రీధర్‌ను కలిసి వక్ఫ్ బోర్డు స్థలాలు, కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు సమస్యలు సోమవారం ఆయనకు వివరించారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు అనేకం అన్యాక్రాంతం అయ్యాయన్నారు. వాటి వలన ముస్లింలకు మేలు కంటే కీడు ఎక్కువగా జరుగుతుందని తెలిపారు. కేంద్రం తీసుకురానున్న వక్ఫ్ బోర్డు సవరణతో భూములు మరింత అన్యాక్రాంతం అవుతాయని వివరించారు. దీనిపై ప్రభుత్వ పెద్దలకు సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీధర్‌ను శాలువాతో సత్కరించారు.

ధరలేక పత్తి రైతు దిగాలు

- పత్తి తీతలు ప్రారంభం
- వర్షాలు, వరద దెబ్బకు తగ్గిన దిగుబడి
- ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం కొనాలి
- వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి


చంద్రగూడెంలో పత్తి తీస్తున్న కూలీలు

మైలవరం: గిట్టుబాటు ధర లేక పత్తి రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షాలు, వరదల కారణంగా ఆశించిన దిగుబడులు రాక నిరాశకు గురవుతున్న పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేక మరింత బాధ పడుతున్నారు. మైలవరంలో పత్తి తీతలు ప్రారంభించారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని మైలవరం మండలంలో పత్తి నాలుగు వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తుండగా, జి.కొండూరు మండలంలో 4,200 ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలంలో 460 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలోని నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో రైతులు ఈ సంవత్సరం లక్ష ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

తగ్గిన దిగుబడులు..

ప్రారంభం నుంచి వచ్చిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల వలన ఈ ఏడాది పత్తి చేలు ఆశాజనకంగా లేవని రైతులు తెలిపారు. పత్తి కాపు చేతికి వస్తున్న సమయంలో వరదలు, వర్షాలతో చేలు మునిగి పంట దెబ్బతింది. పత్తికాయలు నల్లగా మారి దిగుబడులు తగ్గాయని రైతులు వాపోయారు. ఎకరానికి సుమారుగా 10 క్వింటాళ్ల దిగుబడులు రావాల్సి ఉండగా ఈ ఏడాది ప్రతి కూల వాతావరణంలో ఐదు క్వింటాళ్లకు మించి రాదని రైతులు తెలిపారు.

పెట్టుబడి రూ.50 వేలకు పైనే..

ఎకరానికి విత్తనాలు రెండు ప్యాకెట్లు కలిపి రూ.3,600, దుక్కి దున్నినందుకు ఎకరానికి రూ.రెండు వేలు, కల్టివేటర్ వేసినందుకు రూ.వేయి, రోటో వేటర్‌కు రూ.వేయి, సాళ్లు తీసినందుకు రూ.రెండు వేలు, కలుపులకు రూ.10 వేలు (2, 3 ట్రిప్పులు), పైపాటు మందులు రూ.ఆరు వేలు, మందు కట్టలు రూ.3,600, యూరియా కట్ట రూ.600 పెట్టుబడి అవుతోంది. పత్తి తీతకు కూలీలకు ఒకరికి రూ.300 రోజుకు, కనీసంగా ఐదారుగురు కావాల్సి ఉంటుంది. మొత్తంగా పెట్టుబడి ఎకరాకు రూ.50 వేల పైబడి అవుతోంది.

మద్దతు ధర పట్టించుకోని ప్రభుత్వం

కానీ ధర లేకపోవడంతో పెట్టిన పెట్టిబడి కూడా వచ్చేపరిస్థితి లేదని రైతులు తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7500 ఇవ్వాలని సూచించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

ఇదిలా ఉండగా మైలవరంలో ఇంకా పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడం గమనార్హం. దీంతో చేసిన అప్పులు తీర్చుకోవడానికి రైతులు తమ ఇళ్ల వద్దే పత్తిని తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రస్తుతానికి పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఫ్లెక్సీ మాత్రం మైలవరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేశారు. మరో రెండు, మూడు రోజుల్లో స్థానిక ఎమ్మెల్యేచే పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు అధికారికంగా తెలిసింది.

ప్రభుత్వం ఆదుకోవాలి..



నేను ఏడున్నర ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా..ఈ ఏడాది పత్తి దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. గతంలో క్వింటా రూ.ఐదు వేలకు పైబడి అమ్మడం జరిగింది. ఈ ఏడాది కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలి. దళారులు ఇళ్ల వద్దకు వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– జే శ్రీనివాసరావు, బొర్రగూడెం

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ఆర్డీఓ మొవిడి వాణి



నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా అధికారులు పరిష్కరించాలని నూజివీడు ఆర్డీఓ మొవిడి వాణి పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి 14 అర్జీలు రాగా, అందులో నివాస గృహాల మధ్య చెత్తపోగు తొలగించాలని, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా విద్యుత్ సర్వీసును ఇచ్చారని, తీగలు నాసిరకమైనందున తెగిపోయాయని, వాటి స్థానంలో నూతన విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని, అన్నవరం నుంచి వెంకటాయపాలెం వరకు రోడ్డు వెంబడి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎస్‌వై.నూరాని, డీఎల్‌డీఓ వెంకటరత్నం, హెచ్‌వో ఆర్.హేమ, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొండపల్లి మున్సిపాల్టీ 5వ డివిజన్ కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ తెలిపారు. మున్సిపాల్టీలో సోమవారంపర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చేసిన ఫిర్యాదులను మున్సిపాల్టీ సిబ్బందితో పరిష్కారానికి కృషి చేశారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కౌన్సిలర్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మంత్రి కొలుసు పార్థసారథి


మట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లిలో సోమవారం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించారు. గ్రామస్తులు వివిధ సమస్యలపై వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లిలో రూ.10 లక్షలతో రెండు సీసీ రోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై డీఈతో మాట్లాడి వారం రోజుల్లో ఏర్పాటు చేయా లని ఆదేశించారు. గ్రామ సమీపంలోని అట్ల ఫ్యాక్టరీ నుంచి వచ్చే విషపూరితమైన నీరు చెరువులో కలుస్తోందని వచ్చిన ఫిర్యాదుపై మంత్రి స్పందిస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యానికిఆర్డీఓ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. ఎస్సీ శ్మశానవాటికకు రహదారి విషయంపై మంత్రి స్పందిస్తూ 29 సెంట్ల భూమి కోసం కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. తహసీల్దారు బీ సుబ్బారావు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రవిబాబు



తిరువూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీహెచ్ రవిబాబు నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నుంచి ఆయన బదిలీపై తిరువూరు వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది స్వాగతం పలికారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి


సీఐ సత్యశ్రీనివాస్

నూజివీడు: పట్టణంలో దీపావళి బాణసంచా విక్రయించేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి ప్రభుత్వ నియమ నిబంధలు పాటించాలని పట్టణ సీఐ పీ సత్యశ్రీనివాస్ తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ బాణసంచా లైసెన్సుదారులు అధికారులు నిర్ణయించిన బహిరంగ ప్రదేశాల్లోనే ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని బాణసంచా విక్రయించుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిప్రమాద నిరోధక సామగ్రిని తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. లైసెన్సులు లేకుండా మందుగుండు సామగ్రి తయారీ, నిల్వ చేయడం, విక్రయించడం నేరమని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దీపావళి పర్వదినాన్ని ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని, సాధ్యమైనంతవరకు కాలుష్య రహిత టపాసులనే కాల్చాలని ఆయన సూచించారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, సహాయం అవసరమైనా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101, డయల్ 112 నంబర్లకు తెలియజేయాలన్నారు.


తిరువూరు స్టేషనులో బాణసంచా విక్రేతలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

తిరువూరు: దీపావళి పర్వదిన సందర్భంగా బాణసంచా విక్రయాలు జరిపే వారు నిబంధనలు తప్పక పాటించాలని తిరువూరు సెక్టార్-1 ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. స్థానిక పోలీసుస్టేషనులో సోమవారం బాణసంచా దుకాణాల లైసెన్సుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదాలు జరగకుండా దుకాణాల వద్ద ఇసుక, నీరు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. దుకాణాల మధ్య నిర్ణీత దూరం ఉండాలని ఆదేశించారు. అమ్మకాలు జరిగే ప్రదేశంలో బాణసంచా కాల్చడం నిషిద్ధమని, ఇందుకు దుకాణదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లైసెన్సు లేకుండా బాణసంచా విక్రయించడం నేరమని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

చాట్రాయి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని చాట్రాయి, కోటపాడు, చీపురుగూడెం, చిత్తపూరు, చనుబండ, మర్లపాలెం గ్రామాల్లో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాధారణ రకం క్వింటా రూ.2,300, గ్రేడ్ ఎ రకం క్వింటా రూ.2,320 ధరను ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

నూజివీడు: కార్తికమాసం సందర్భంగా ఈనెల 3వ తేదీ నుంచి ఆర్టీసీ నూజివీడు డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సీహెచ్ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. పంచారామాలను దర్శించుకునేందుకు స్పెషల్ బస్సుకు టికెట్ ధర రూ.1200. భక్తులు టికెట్లను ఆన్‌లైన్‌లో, ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు. వచ్చేనెల 3,10,17,24 తేదీల్లో పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, 20 మంది కంటే ఎక్కువ భక్తులు ఒకేచోట ఉంటే అక్కడికే బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తామన్నారు. కార్తికమాసం సందర్భంగా అరుణాచలంకు బస్సు సర్వీసును నడుపుతున్నామని తెలిపారు. టికెట్ ధర రూ.2,800 ఉంటుందన్నారు. త్రిలింగదర్శనానికి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, దీని ధర రూ.1,900 వివరించారు. వివరాల కోసం 99498 78945, 73829 01757 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

విద్యుత్ చార్జీలు పెంపు దారుణం


సమావేశంలో మాట్లాడుతున్న నరశింహం

చాట్రాయి: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని నూజివీడు నియోజకవర్గం సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరశింహం అన్నారు. సోమవారం మండలంలోని చిన్నంపేటలో ఆ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక నవంబర్ నుంచి చార్జీలు పెంచడం ప్రజల్ని మోసం చేయడమేనని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపుపై కూటమి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోకపోతే వామ పక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఉద్యమిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొమ్ము ఆనందం, చెంగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

1న చేతి వృత్తిదారుల సమైఖ్య మహాసభ

మైలవరం: నవంబర్ 1వ తేదీన ఎన్టీఆర్ జిల్లా చేతి వృత్తిదారుల సమైఖ్య మొదటి మహాసభ మైలవరంలోని మారుతి కల్యాణ మండపంలో నిర్వస్తామని జిల్లా కన్వీనర్ బుద్దారపు వెంకట్రావు సోమవారం తెలిపారు. సభకు ముఖ్యఅతిథిగా చేతి వృత్తిదారుల సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి కే రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సమైఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సీ లింగమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ పాల్గొంటారన్నారు. మహాసభను జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు


నూజివీడు మండలంలో వృథాగా సంపద సృష్టి కేంద్రం

నూజివీడు: గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచేందుకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఒక్కో కేంద్రం నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. అయితే అమలులో అధికారుల అశ్రద్ధ, అలసత్వం కారణంగా అవి పాడు పడిన షెడ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లోని చెత్తను తరలించడానికి లక్షలాది రూపాయలు వెచ్చించి పంచాయతీలకు బ్యాటరీ ఆటోలను సైతం అందించారు. ఇవి చాలా పంచాయతీల్లో మూలన పడ్డాయి. పథకం అమలులో వైఫల్యం చెందడంతో ఖర్చు చేసిన ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది.

నియోజకవర్గంలో 89 పంచాయతీలు

నూజివీడు నియోజకవర్గంలోని 89 గ్రామ పంచాయతీల్లో సంపద సృష్టి కేంద్రాలున్నాయి. ఊరికి సమీపంలో ప్రభుత్వ స్థలాల్లో వీటిని నిర్మించారు. ఈ కేంద్రాల్లో తడి, పొడి చెత్త వేయడానికి వేరు వేరుగా తొట్టిలను నిర్మించారు. ప్లాస్టిక్, ఇనుప, సీసాలు వంటి వస్తువులను వేర్వేరుగా సేకరించేలా అవసరమైన ఏర్పాట్లు చేశారు. గ్రీన్ అంబాసిడర్లను నియమించి పలుమార్లు శిక్షణ ఇచ్చారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించేందుకు గ్రామాల్లో ప్రతి ఇంటికీ పసుపు, ఎరుపు రంగు డస్ట్ బిన్లను అందజేశారు. ఇంత చేసినా ఆచరణలో మాత్రం శూన్యం కాగా, గ్రామ పంచాయతీల్లో పోగయ్యే చెత్తను రోడ్ల వెంట పడేసి చేతులు దులుపుకుంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు..


చాట్రాయి మండలం చిత్తపూరులో రోడ్డు పక్కన శిథిలావస్థలో ఎలక్ట్రిక్ ఆటో


ఇక సంపద సృష్టి కేంద్రాలైతే అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా, తాగుబోతులకు అడ్డాగా మారాయి. స్వచ్ఛభారత్ కింద వీటికి వెచ్చించిన ప్రజాధనం ప్రస్తుత పాలన తీరుతో వృథాయే తప్ప ఉపయోగం మాత్రం కలగలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి సక్రమంగా అమలు చేస్తే కొద్దో గొప్పో ఆదాయం రావడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉంది.

ఎన్ఎస్‌పీ కాల్వలపై గండ్లు పూడ్చివేయండి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: మైలవరం నియోజకవర్గం పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పీ) కాల్వలపై ఇటీవల వరద ధాటికి పడిన గండ్లు పూడ్చివేతకు చర్యలు ఈసుకోవాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎన్ఎస్‌పీ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండపల్లి, జక్కంపూడి, చెవుటూరు, వెల్వడం, జమలాపురం, రంగాపురం మేజర్ కాల్వలు, నూజివీడు, మైలవరం బ్రాంచ్ కాల్వలకు ఇటీవల వరదలకు పలుచోట్ల గండ్లు పడ్డాయని తెలిపారు. గండ్లు పూడ్చివేసి ఎన్ఎస్‌పీ జలాలు సవ్యంగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నవంబర్ 15 నుంచి సాగర్ జలాలు విడుదల చేయనున్న దృష్ట్యా కాల్వలకు మరమ్మతులు చేపట్టి, చెరువులను నింపాలన్నారు. సమావేశంలో ఎన్ఎస్‌పీ ఇంజినీర్లు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



తిరువూరు నగర పంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

తిరువూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ తిరువూరు నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ధర్నా చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న కార్మికులకు కనీసం పనిముట్లు సకాలంలో ఇవ్వకపోవడం, యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యధోరణి అనుసరిస్తున్నారని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బలగాని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెండింగులో ఉన్న నాలుగు నెలల ఆరోగ్య అలవెన్సు వెంటనే ఇవ్వాలని, గత ఏడు సంవత్సరాలుగా అదనపు కార్మికుల పేరుతో పనిచేస్తున్నవారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు తక్షణమే భవిష్యనిధి సొమ్ము చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు సురేష్, నాగరాజు, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున చిన్నారులు

పవిత్ర సంగమం వద్ద భద్రతాలోపం


ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద మెట్లపై స్నానానికి దిగిన చిన్నారులు

ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమం వద్ద భద్రతాలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సంగమం స్నానఘాట్ల వద్ద ప్రమాదకర పరిస్థితుల్లో ముగ్గురు చిన్నారులు సోమవారం స్నానానికి నీళ్ల అంచున మెట్లపై నిలబడటం చూసిన వారి గుండె జల్లుమంది. స్పందించిన స్థానికులు చిన్నారులు బెదిరించి అక్కడి నుంచి పంపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో కొండపల్లికి చెందిన మగ్గురు చిన్నారులు, విజయవాడకు చెందిన ముగ్గురు కళాశాల విద్యార్థులు నీటమునిగి మృత్యువాత పడ్డారు.

సంగమం సమీపంలో ఇతర ప్రాంతాల నుంచి భిక్షాటనకు వచ్చిన వలస జీవులు తాత్కాలిక గుడారాలు వేసుకుని జీవిస్తుంటారు. పెద్దలు గ్రామాల్లోకి వెళ్లిన సమయాల్లో చిన్నారులు సంగమం వద్దకు స్నానాలకు చేరుతున్నారు. ఇటీవల కాలంలో వచ్చిన వరదలకు మెట్లపై మట్టి పేరుకు పోయి కొద్దిపాటి తడి తగిలినా కాలుజారే పరిస్థితుల్లో చిన్నారులు ఉండటం ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది. ఆదమరిస్తే కృష్ణమ్మ ఒడిలో ప్రాణాలు కలిసిపోవడమే. గతంలో పర్యాటక పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేసినప్పటికీ నిత్యం ఖాళీగా దర్శమిస్తోంది. గతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది నిత్యం పహారా కాసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంగమం ప్రాంతాన్ని సీఆర్డీఏ పరిధిలోకి చేర్చడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్, మున్సిపాల్టీ అధికారుల పర్యవేక్షణ కరువైంది.

రేపు జాబ్‌మేళా

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈ నెల 30న జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ సుశీలరావు తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, సీడాక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జీనియస్ కన్సల్టెంట్స్ లిమిటెడ్‌లో 50, డీమార్ట్‌లో 50 ఖాళీలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. పది, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిగ్రీ చదివిన ఎన్టీఆర్ జిల్లా అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చని సూచించారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

బలివే(ముసునూరు): బలివేలోని ప్రసిద్ధ రామలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన నాలుగు హుండీలలో కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి బలివేలోని ఆలయం వద్ద దేవదాయ, ధర్మాదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, గ్రామ ప్రజలు, దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో సిబ్బంది హుండీల లెక్కింపు నిర్వహిస్తారని అన్నారు. మొత్తం నాలుగు హుండీల ద్వారా లభించిన ఆదాయాలను లెక్కించనున్నట్లు